శైవ క్షేత్రం.. సమస్యల వలయం

- త్రేతేశ్వరుడి సన్నిధిలో భక్తులకు అవస్థలు
- పట్టించుకోని అధికార యంత్రాంగం



శిథిలావస్థకు చేరుకున్న యాత్రికుల వసతి గృహం

రాజంపేట రూరల్ : బహుదానది తీరం ఒడ్డున త్రేతా యుగంలో లింగోద్భవమైన కైలాసనాథుడు త్రేతేశ్వరునిగా కొలవబడుతున్న అతిపురాతన శైవ క్షేత్రం శ్రీకామాక్షి సమేత త్రేతేశ్వరస్వామి దేవస్థానం. యుగాలు మారుతున్నప్పటికీ ఆలయ అభివృద్ధిలో ఎలాంటి మార్పు రాలేదు. కాలంతో పాటు రాజులు, పాలకులు, ప్రభుత్వాలు మారినప్పటికీ సౌకర్యాల కల్పనలో మాత్రం వెనకబడిపోయింది. ప్రతి సంవత్సరం శివరాత్రి మహోత్సవాలకు వేల సంఖ్యలో భక్తులు త్రేతేశ్వరునికి మొక్కులు చెల్లించుకుంటారు. రోజూ పదుల సంఖ్యలో ప్రతి సోమవారం వందల సంఖ్యలో స్వామి వారికి దర్శించుకుంటారు. అయితే ఈ దేవస్థానం పురోగతి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మారింది.

కోతుల బెడద

ఈ పుణ్యక్షేత్రం పరిసరాల్లో కోతుల బెడద శృతిమించిపోయింది. ముఖ్యంగా చిన్నారులు, మహిళలు స్వామి వారి దర్శనానికి వచ్చే సమయంలో కోతుల దాటికి బెంబేలెత్తిపోతున్నారు. భక్తులు తెచ్చుకునే తిను బండారాలను చూస్తే కోతులు దాడి చేసి గాయపరిచి లాక్కెళ్లుతున్నాయి. భక్తులు పడుతున్నప్పటికీ సంబంధిత అదికారులు చర్యలు తీసుకోకపోవటం భక్తులను బాధిస్తుంది.

కొరవడిన విద్యుత్ సౌకర్యం

త్రేతేశ్వరునికి విద్యుత్ సౌకర్యం కొరవడటంతో వెలుగుల కోసం వేచిచూడాల్సి వస్తుంది. ఇక్కడ ట్రాన్స్‌ఫార్మర్ లేక పోవటంతో కార్తీక పర్వదినాల్లో, శివరాత్రి మహోత్సవాల సమయంలో చీకటి తాండవిస్తుంది. ప్రత్యేక ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు.

తాగునీటి సౌకర్యం శూన్యం

త్రేతేశ్వరుని సన్నిధిలో కొన్ని సంవత్సరాల నుంచి తాగునీటి సౌకర్యం లేకపోవటంతో భక్తులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇక్కడ మంచి నీరు లభించదు. వెంట తెచ్చుకున్న నీటితో భక్తులు దాహం తీర్చుకోవాల్సి వస్తోంది. శాశ్వత నీటి సౌకర్యం కల్పిస్తామని నాయకులు హామీలు ఇచ్చినప్పటికి ఆ దిశగా అడుగులు పడటంలేదు.

స్నానానికి ఇక్కట్లు

బహుదానదీలో స్నానం చేస్తే సర్వపాపాలు పోయాయనేది నానుడి. నిత్యం పదుల సంఖ్యలో మహిళలు తమ కుటుంబంతో సహా విచ్చేసి స్నానమాచరిస్తున్నారు. అయితే వారికి ప్రత్యేక స్నాన గదులు లేక పోవడంతో ఎంతో అసౌకర్యంగా భావిస్తున్నారు. శివరాత్రి పర్వదినములలో తాత్కాలిక నీటి పైపులు ఏర్పాటు చేసి అదికారులు చేతులు దులుపుకుంటున్నారు. కొన్ని సంవత్సరాల నుంచి శాశ్వత స్నాన గదులు ఏర్పాటు చేయాలని మహిళా భక్తులు కోరుతున్నప్పటికీ వారి గోడు పట్టించుకున్న నాథుడే లేడు.





వసతులు లేని మహిళల స్నాన గదులు

శిథిలావస్థలో యాత్రికుల వసతి గృహం

2015 సంవత్సరంలో రూ.84 లక్షల వ్యయంతో నిర్మించిన యాత్రికులు వసతి గృహం శిథిలావస్థకు చేరుకుంది. ఈ వసతి గృహంలో సౌకర్యాలు కల్పించక పోవటంతో భక్తులు వినియోగించుకోలేదు. నేడు ఈ వసతి గృహం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిపోయింది. ఇప్పటికైనా అధికారులు చర్యలు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు.

శైవ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

రాజంపేట రూరల్ : మహా శివరాత్రిని పురస్కరించుకొని 28వ తేదీ అత్తిరాల, గుండాలకోన, తలకోన వంటి శైవ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్లు రాజంపేట డిపో మేనేజర్ జి.రమణయ్య సోమవారం తెలియజేశారు. రాజంపేట నుంచి అత్తిరాలకు 20, రాజంపేట నుంచి రైల్వేకొడూరు మీదుగా తలకోనకు 10, రాజంపేట నుంచి రైల్వే కోడూరు మీదుగా వై.కోట, గుండాలకోనలకు 12 సర్వీసులను ప్రత్యేకంగా నడపనున్నట్లు తెలియజేశారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నాణ్యమైన ఆహారం అందించాలి

రాయచోటి టౌన్ : ఆహార వ్యాపారం సాగించే ప్రతి వ్యాపారి వినియోగదారులకు నాణ్యమైన ఆహారం అందించాలని ఫుడ్ సేఫ్టీ ట్రైనర్ పాలకొలను యశోద దేవి తెలియజేశారు. సోమవారం రాయచోటి డైట్ కళాశాల ఆవరణలో అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆహార వ్యాపారం సాగించే వారు తప్పకుండా నాణ్యతమైన ఆహారాన్ని అందించకపోతే కఠిన చర్యలు తప్పవన్నారు. కల్తీని గుర్తించాలని, ఫుడ్ కలర్స్, టెస్టీ సాల్ట్‌ను వాడకూడదన్నారు. కార్యక్రమంలో అన్నమయ్య కడప జిల్లాల ఫుడ్ షేఫ్టీ అధికారి షమీమ్ బాషా, టీం హెడ్ పూజారి రెడ్డి శేఖర్, డీఆర్‌డీఏ ఎన్జీఓ చైర్మన్ సుమలత, ఎగ్జిక్యూటీవ్‌లు సుమలత, విజయలత, ఆంజనేయులు, విష్ణువర్ధన్, నరసింహులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నైనాదీశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకారంలో నైనాదీశ్వరుడు

పెనగలూరు : మండల కేంద్రమైన పెనగలూరు గ్రామంలోని నైనాదీశ్వరస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నైనాదీశ్వర స్వామి, కామాక్షి దేవి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. జనమేజయుడు రాజు నిర్మించిన ఆలయంలో బ్రహ్మ సూత్రాలు మూలవిరాట్‌పై చెక్కబడి ఉన్నాయి. ఈ బ్రహ్మ సూత్రాలు చుట్టుపక్కల ప్రాంతాలలో ఎక్కడా శివాలయంలో కనిపించవు. అందుకే పెనగలూరు నైనాదీశ్వర స్వామి కోరికలు తీర్చే స్వామిగా ఇక్కడి ప్రజలు విశ్వాసమని పురోహితుడు చెంచు సుబ్బనరసయ్య తెలిపారు. మహా శివరాత్రికి స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు, కల్యాణం జరుపనున్నట్లు తెలియజేశారు.

వైభవంగా కల్యాణోత్సవం



కల్యాణ వేడుకను నిర్వహిస్తున్న వేదపండితుడు

చిట్వేలి : మైలపల్లి శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయంలో ధ్వజ ప్రతిష్ట కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉదయం పూజా కార్యక్రమాలు అనంతరం స్వామివారి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం టిటిడి వారు అన్నమయ్య కీర్తనలు ఆలపించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. శనివారం ప్రారంభమైన ధ్వజప్రతిష్ట కార్యక్రమం సోమవారం కల్యాణోత్సవం, గ్రామోత్సవంతో ముగిసిందని ధర్మకర్త వడ్డి శంకర్ రెడ్డి తెలియజేశారు. సాయంత్రం గ్రామోత్సవంలో ఘనంగా ఊరేగించారు. వందలాది మంది భక్తులు కల్యాణోత్సవంలో పాల్గొని వేడుకను తిలకించారు. రాయపెద్ది రాజశేఖర్ శర్మ కార్యక్రమాలను జరిపించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

కోళ్ల ఫారం ప్రారంభం

రామాపురం : మండలంలోని కుమ్మరపల్లె గ్రామానికి చెందిన కిరణ్‌కుమార్‌రెడ్డి ఏర్పాటు చేసిన కోళ్ల ఫారాన్ని సోమవారం మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి ప్రారంభించారు. ఆయనతోపాటు వైఎస్సార్‌సీపీ నాయకులు ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్‌రెడ్డి, అమర్‌నాథరెడ్డి, శేఖర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, సహదేవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్కీంబోరు స్టార్టర్‌కు నిప్పు

రామాపురం : మండలంలోని నల్లగుట్టపల్లెకాలనీకి నీటిని అందించే స్కీం బోరుకు సంబంధించిన వైర్లకు, స్టార్టర్‌కు ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు అంటించడంతో స్టార్టర్, మోటార్‌కు బిగించిన విద్యుత్ వైర్లు పూర్తిగా కాలినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. వెంటనే విషయాన్ని ఫైర్ అధికారులకు తెలియజేయడంతో మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని మంచినీటి పథకానికి మరమ్మతులు చేయించి గ్రామానికి నీటిని అందించేలా దృష్టి సారించాలని గ్రామస్తులు కోరారు.

ఆప్కాస్‌ను రద్దు చేయండి

రాజంపేట రూరల్ : ఆప్కాస్ సంస్థను రద్దు చేసి మున్సిపల్ కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని ఉత్తరం ద్వారా సీఎంకు తెలియజేసినట్లు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు చిట్వేలి రవికుమార్ తెలియజేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద సోమవారం మున్సిపల్ కార్మికులు రాసిన ఉత్తరాలను పోస్టు చేశారు. తక్షణమే ఆప్కాస్‌ను రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పీవీ రమణ, జిల్లా కోశాధికారి లక్ష్మిదేవి, యూనియన్ నాయకులు ఎం.రమణ, బాలజీ, ప్రమీల, సురేష్, సునీత తదితరులు పాల్గొన్నారు.

బీటెక్ ఫలితాల్లో బిట్స్ విద్యార్థుల సత్తా



ఫలితాల్లో ప్రతిభచాటిన విద్యార్థులతో కళాశాల చైర్మన్ భాస్కర్, అధ్యాపకులు

రామాపురం : జేఎన్‌టీయూ అనంతపురం విడుదల చేసిన మొదటి సంవత్సరం సెమిస్టర్‌లో బిట్స్ విద్యార్థులు ప్రతిభను చాటినట్లు కళాశాల చైర్మన్ మన్నూరు భాస్కర్ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం విద్యార్థుల అభినందన సభలో ఆయన మాట్లాడారు. మొదటి సంవత్సరం సెమిస్టర్ ఫలితాల్లో సీఎస్‌సీ పఠాన్ సాజిదా ఖానమ్(87.5శాతం) రాణించిందన్నారు. అలానే ఏఐలో సాయిదర్శిని 80.8 శాతంతోపాటు మరో 20 మంది విద్యార్థులు 80శాతం కన్నా ఎక్కువగా సాధించి ప్రతిభ చాటినట్లు చెప్పారు. అనంతరం విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేశారు.

మహాశివరాత్రికి ఆలయాలు ముస్తాబు

నేటి నుంచి అగస్త్యేశ్వర స్వామి ఉత్సవాలు

సంబేపల్లె : మండల పరిధిలోని మోటకట్ల గ్రామంలోని శ్రీ వెంకటశివసాయి ఆలయంలో శివరాత్రి శోభ ఉట్టి పడుతోంది. మహాశివరాత్రి ఉత్సవాలను వైభవంగా జరిపేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు ఆలయ చైర్మన్ వెంకటనాథరెడ్డి, ఆయన సోదరులు పేర్కొన్నారు. శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయానికి రంగులతో కొత్త సొబగును అద్దగా.. విద్యుత్ దీపాలతో అలంకరించి మరింత అందాన్ని తెచ్చారు. భక్తులు పెద్దసంఖ్యలో హాజరు కావాలని ఆయన విజ్ఞప్తి చేస్తున్నారు. అదే విధంగా మండలంలోని శ్రీ గృహేశ్వరీ పశుపతినాథ ఆలయం, చిన్నజంగంపల్లె మల్లికార్జునస్వామి ఆలయాలలో శివరాత్రికి ఆయా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

రామాపురం : పర్వదినమైన మహాశివరాత్రికి మండలంలోని శివాలయాలు అంగరంగ వైభవంగా ముస్తాబవుతున్నాయి. మండలంలోని కంభరాయి గుట్టపై ఉన్న ద్వాదశజ్యోతిర్లింగాలు, ఘాటు రోడ్డులోని భవానీశంకర ఉమామహేశ్వరాలయం, కడవకూటివాండ్లపల్లె(పాతమేదరపల్లె) బండపల్లిలో వెలసిన మరకతశివలింగాలు, కల్పనాయునిచెరువులన్నున్న కల్పనాథేశ్వర ఆలయం, తూపల్లె, దేవళంపల్లె, హనాపురంలోని మూలస్థానేశ్వరాలయం, గంగనేరు హరిహర ఆలయం, కొత్తపల్లె శివాలయం, బీసీకాలనీ నందీశ్వరాలయం, సరస్వతిపల్లెలోని భీమేశ్వరాలయం, చిట్లూరులోని శివాలయం, సూరకవాండ్లపల్లెలోని ముక్తిలింగేశ్వరాలయం, వెంకటరెడ్డిగారిపల్లెలోని బసవేశ్వరాలయం, శివరాత్రి పురస్కరించుకుని అన్ని ఏర్పాట్లు చేశారు.



రామాపురం: ద్వాదశ జ్యోతిర్లింగాలు ఆలయం

అగస్త్యేశ్వర స్వామి ఉత్సవాలకు వేళాయె

రాయచోటి జగదాంబసెంటర్ : అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి పట్టణం పాతరాయచోటిలో వెలసివున్న శ్రీ దాక్షాయణీ సమేత శ్రీ అగస్త్యేశ్వర స్వామి దేవస్థానంలో నేటి నుంచి శివరాత్రి మహోత్సవ వేడుకలను నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. 25వ తేదీ మంగళవారం ఉదయం స్వస్తి పుణ్యాహవాచనము, గోపూజ, కలశస్థాపనము, అంకురార్పణము, మహాగణపతిపూజ, రుద్రాభిషేకము విశేష పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నారు. 26వ తేదీన రుద్రాభిషేకములు, పంచామృతాభిషేకములు, రుద్రహోమము, పూర్ణాహుతి, శివపార్వతుల కల్యాణం, మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ కార్యక్రమం రాత్రి 7 గంటలకు గ్రామోత్సవం, జాగరణ, భజన కార్యక్రమం, లింగోద్భవ పూజ కార్యక్రమాలను నిర్వహించనున్నారు.



అలంకరణలో దర్శనమిస్తున్న అగస్త్యేశ్వరుడు



సంబేపల్లె: ముస్తాబైన మోటకట్ల వెంకటశివసాయి ఆలయం



రాయచోటి జగదాంబ సెంటర్: విద్యుత్ దీపాలంకరణలో అగస్త్యేశ్వరుడి ఆలయం

పంచాయతీ నిధులు సొంత ఖాతాల్లోకి!

- నిధుల స్వాహాకు ఒకటై కథ నడుపుతున్న సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులు
- గతంలో జరిగిన అక్రమాలపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు; చర్యలు శూన్యం



అనంతంపల్లి పంచాయతీ కార్యాలయం

పుల్లంపేట : దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలి అనే సామెతను అనంతంపల్లి సర్పంచ్, పంచాయతీ కార్యదర్శిలు తూచా తప్పక పాటిస్తున్నారు. అధికారంలో ఉన్నాం తామనెవరు అడుగుతారనే ధీమాతో పంచాయతీ నిధులు స్వాహా చేయడమే కాక మరోమారు నిధులు దోచేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పంచాయతీలో వివిధ పనులు చేసినట్టు బిల్లులు సృష్టించి రూ.5లక్షల పైచిలుకు నిధులను కాజేసినట్టు గ్రామస్తులు తెలిపారు. పంచాయతీ నిధుల గోల్‌మాల్‌పై జిల్లా కలెక్టర్‌కు అనంతంపల్లి గ్రామ ప్రజలు గతంలో ఫిర్యాదు చేసినప్పటికీ వారిపై ఇంత వరకు చర్యలు లేవు. దీంతో నియోజకవర్గంలోని ప్రభుత్వ పెద్దల అండతోనే కనీసం విచారణకు కూడా అధికారులు సాహసించడంలేదనే వాదనను గ్రామస్తులు తీసుకొస్తున్నారు. ఇదే అదనుగా భావించిన వారు మరోమారు పంచాయతీ నిధులను కాజేసేందుకు యత్నిస్తున్నారని గ్రామస్తులు చెబుతున్నారని, పంచాయతీ అభివృద్ధికి వెచ్చించాల్సిన నిధులను ఇలా తమ ఖాతాల్లోకి వేసుకుంటున్నా ఉన్నతాధికారులు స్పందించకపోవడంతో ఇందులో పెద్దల హస్తం ఉందేమోనని గుసగుసలాడుతున్నారు. చేయని పనులను చేసినట్టు చూపిస్తూ నిధులు తమ సొంత ఖాతాల్లోకి జమ చేసుకుంటున్న అక్రమార్కులపై ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి కఠిన చర్యలు తీసుకుని గ్రామానికి కేటాయించిన నిధులు అభివృద్ధి పనులకు వినియోగించాలని కోరుతున్నారు.

కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

రాయచోటి అర్బన్ : భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించి, పెండింగ్‌లోని 46వేల క్లెయిమ్‌లకు సంబంధించిన నిధులు మంజూరు చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.గంగాధర్, సాంబశివ, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రలు డిమాండ్ చేశారు. సోమవారం ఆయా సంఘాల ఆధ్వర్యంలో కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. మాట్లాడుతూ భవన నిర్మాణ, ఇతర నిర్మాణ రంగాలలో పని చేస్తున్న కార్మికులు అనేక సమస్యలతో జీవితాలు గడుపుతున్నారన్నారు. కేంద్ర కార్మిక సంఘాలు ఐదు దశాబ్దాలుగా సుదీర్ఘ పోరాటాల ఫలితంగా కేంద్ర ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ చట్టం – 1996ను తెచ్చినా పాలకుల నిర్లక్ష్యంతో చట్టం అమలుకు పూనుకోలేదన్నారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన సంక్షేమ బోర్డును కూటమి పార్టీల నాయకులు ఎన్నికల సందర్భంగా పునరుద్ధరిస్తామని హామీలు ఇచ్చారని, ప్రభుత్వం ఏర్పడి నేటికి 9 మాసాలు అవుతున్నప్పటికీ సంక్షేమ బోర్డును పునరుద్ధరించడంలో వైఫల్యం చెందారని ఆరోపించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి నరసింహులు మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో అద్దె ఇండ్లలో ఉంటున్న భవన నిర్మాణ కార్మికులకు పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు ఇంటి స్థలాన్ని ఇచ్చి ప్రభుత్వమే ఇళ్లను నిర్మించాలన్నారు. భవన నిర్మాణ కార్మికులకు సమస్యల పరిష్కారం కావడానికి పోరాటం ద్వారానే సాధించుకోవాలని, కార్మిక పోరాటాలకు సీపీఐ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.


ఆక్రమణదారులపై కేసు నమోదు చేయాలి



వినతిపత్రాన్ని తలుపునకు తగిలిస్తున్న నాయకులు

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు నియోజకవర్గంలోని మండలాల్లో చెరువులు ఆక్రమించుకున్న భూ బకాసురలపై చర్యలు తీసుకోవాలని బీకేఎంయూ నియోజకవర్గ అధ్యక్షులు మొగలి వినయ్, కార్యదర్శి జయరామయ్య, సీపీఐ మండల కార్యదర్శి దార్ల రాజశేఖర్‌లు సోమవారం డిమాండ్ చేశారు. సోమవారం డీఈ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీటి పారుదలశాఖ అధికారులు కార్యాలయాలకే రావడం లేదని, అలాంటి వారు చెరువులను ఎలా సంరక్షిస్తారని వారు మండిపడ్డారు. ముడుపులు తీసుకుంటూ దర్జాగా ఇరిగేషన్ అధికారులు తిరుగుతున్నారని విమర్శించారు. నీటిపారుదలకు సంబంధించిన చెరువులు, వంకలు, ఏరులకు చెందిన వేలాది ఎకరాల భూమిని ఆక్రమించుకుంటుంటే అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. తక్షణమే జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

జాతీయ స్థాయిలో ఏఐటీఎస్ విద్యార్థి ప్రతిభ



విద్యార్థిని అభినందిస్తున్న ఏఐటీఎస్ అధ్యాపకులు

రాజంపేట రూరల్ : జాతీయ స్థాయిలో నిర్వహించిన 'ఏఎస్‌హెచ్‌వీ–2కే25'లో ఏఐటీఎస్ విద్యార్థి సాయిలూష కొశెట్టి తన ప్రతిభను ప్రదర్శించి టెక్నో విభాగంలో ద్వితీయ బహుమతి పొందటం ఎంతో గర్వకారణంగా ఉందని ఏఐటీఎస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.ఎం.వీ నారాయణ తెలియజేశారు. స్థానిక అన్నమాచార్య విశ్వవిద్యాలయంలో సోమవారం విద్యార్థిని అభినందించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ఉపకులపతి ఈ.సాయిబాబారెడ్డి, ఏఐటీఎస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.ఎం.వీ నారాయణ, విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఎస్.మల్లికార్జునరావు, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగ అధిపతి డాక్టర్ ఎం.సుబ్బారావు, సిబ్బంది పాల్గొన్నారు.

పీఎం కిసాన్ నిధులు విడుదల

సుండుపల్లె : 19వ విడత పీఎం కిసాన్ నిధులను ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ సోమవారం విడుదల చేసి రైతుల ఖాతాల్లోకి జమ చేశారని బీజేపీ మండల అధ్యక్షుడు రమణగౌడ్ తెలిపారు. సోమవారం చిన్నగొల్లపల్లి రైతు భరోసా కేంద్రంలో టీవీ స్క్రీనింగ్ ద్వారా ఏర్పాటు చేసి రైతులతో కలిసి వీక్షించారు. అనంతరం అవగాహనా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం 2018 డిసెంబర్ నుంచి ఈ పథకాన్ని అమల్లోకి తెచ్చి ఇప్పటికే 18 విడతల నిధులను రైతులకు పెట్టుబడి సహాయం కింద అందజేసిందని తెలిపారు. ప్రతి రైతుకీ సంవత్సరానికి రూ.6 వేలు చొప్పున ప్రతి 4 నెలలకు ఒకసారి రూ.2 వేలు నేరుగా లబ్ధిదారుల అకౌంట్లోకి నగదును జమ చేస్తున్నట్టు పేర్కొన్నారు. కేంద్రం అమలు చేస్తున్న ప్రతి పథకంలో పారదర్శకత పాటిస్తున్నామని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చిన్నగొల్లపల్లి గ్రామ వ్యవసాయ సహాయకులు మన్సూర్, రైతులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

సత్తాచాటిన విద్యార్థులు



అభినందన సభలో తైక్వాండోలో ప్రతిభ చాటిన విద్యార్థులతో అకాడమీ గ్రాండ్ మాస్టర్

రాజంపేట రూరల్ : జిల్లా స్థాయిలో కడప డీఎస్‌ఏ స్టేడియంలో నిర్వహించిన తైక్వాండో పోటీలలో తమ విద్యార్థులు సత్తా చాటినట్లు ద్రోణాచార్య మార్షల్ ఆర్ట్స్ అకాడమీ గ్రాండ్ మాస్టర్ బి.సునీల్ తెలియజేశారు. స్థానిక జీఎంసీ క్లబ్ ఆవరణలో జిల్లా స్థాయిలో రాణించిన విద్యార్థులకు సోమవారం అభినందన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పతకాలను, ప్రశంసా పత్రాలను అందజేశారు. అనంతరం మాస్టర్ సునీల్ మాట్లాడుతూ తమ అకాడమీ నుంచి ఏడుగురు విద్యార్థులు పాల్గొన్నారని తెలియజేశారు. అందులో పునీత్, ప్రేమ్ భగత్, సాహిత్, ప్రతీక్‌లు స్వర్ణ పతకాలు, లాలిత్, లోహిత్, కోమల్ కార్తికేయలు రజత పతకాలు సాధించినట్లు తెలియజేశారు. కార్యక్రమంలో అకాడమీ ఉపాధ్యక్షులు బచోటీ భాస్కర్, ప్రధాన కార్యదర్శి చౌడవరం నరసింహ, కరాటే మాస్టర్ కె.గంగారామ్, ప్రభుత్వ ఉపాధ్యాయులు విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిగ్రస్తులను ఆదరించాలి



మాట్లాడుతున్న క్షయ వైద్యాధికారి హరి



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

లక్కిరెడ్డిపల్లి : క్షయ వ్యాధిగ్రస్తులను వెలివేయకుండా ఆదరించాలని క్షయవ్యాధి సూపర్‌వైజర్ హరి పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో క్షయవ్యాధిపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయరోగి దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు క్షయక్రిములు గాలి ద్వారా ఇతరులకు వ్యాప్తి చెందుతాయని, వీటికి దూరంగా ఉండాలన్నారు. రెండు వారాలకు మించి దగ్గు, గళ్ల, జ్వరం, బరువు తగ్గుట, ఆకలి తగ్గడం, ఉమ్మిలో రక్తం పడటం ఇలాంటి లక్షణాలు ఉన్నప్పుడు వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికిలో సంప్రదించాలన్నారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో ఉచితంగా గల్ల పరీక్ష, ఎక్స్‌రే ఆధునిక సీబీఎన్ ఏఏటీ, ఆర్టీపీసీతో పరీక్ష చేయించుకోవాలన్నారు. క్షయవ్యాధి ఉన్నవారు ఆరు నెలలకు సరిపడే ఖరీదైన మందులు ఉచితంగా ప్రభుత్వం అందిస్తుందని, వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. క్షయ వ్యాధిగ్రస్తునికి చికిత్స సమయంలో నెలకు ప్రభుత్వం రూ. 500లు పోషకాహారానికి ఆర్థిక సాయం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ కోమటిరెడ్డి శివశంకర్ రెడ్డి, సీహెచ్‌ఓ రవీంద్ర, ఆరోగ్య సిబ్బంది కుమారి, విమలమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

'తప్పును సరిచేయకుంటే ఆత్మహత్యే శరణ్యం'

చిన్నమండెం : రీ సర్వే సమస్యలు, రెవెన్యూ అధికారుల తప్పుడు పనుల వల్ల ప్రజలు మనోవేదనకు గురవుతున్నామని త్వరలోబాధితులతో కలసిమౌన దీక్ష చేయబోతున్నట్లు మండల వాసి మల్లూరు రెడ్డి వరప్రసాద్ తెలిపారు. సోమవారం చిన్నమండెంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రెవెన్యూ అధికారులు రైతుల సమస్యలు పరిష్కరించాల్సింది పోయి రైతులకు నష్టం చేసే విధంగా మండలంలో వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. వండాడి పంచాయతీ పరిధిలోని 87/3 సర్వే నెంబర్‌లో తనపేరు మీద 5.63 ఎకరాల పట్టా భూమి ఉండగా అందులో 2016లో శ్రీనివాసపురం రిజర్వాయర్ ఎడమ కాలువ కోసం 0.81 సెంట్ల భూమిని సేకరించి దాన్ని సబ్ డివిజన్ చేసి 87/3బిగా కేటాయించారన్నారు. కాలువకు సేకరించిన భూమి మాత్రమే 22ఏ1ఏలో పెట్టాల్సి ఉండగా తనకు సంబంధించిన భూమి మొత్తాన్ని 22ఏ1ఏ లో చేర్చి తనకు తీవ్రనష్టాన్ని తెచ్చారన్నారు. ఈ విషయమై అధికారులకు అనేకమార్లు తెలియజేసినా స్పందించడంలేదని అన్నారు. రిజర్వాయర్ కింద బ్లాక్ చేసిన తన భూమిని మార్చమని కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా తమకు న్యాయం చేయడంలేదని అధికారులు స్పందించకుంటే తమకు ఆత్మహత్య శరణ్యమని ఆవేదనను తెలియజేశారు.

ప్రతి రైతుకు విశిష్ట గుర్తింపు సంఖ్య తప్పనిసరి

సిద్దవటం : మండలంలోని ప్రతి రైతుకు విశిష్ట గుర్తింపు సంఖ్య తప్పనిసరిగా ఉండాలని బద్వేల్ సహాయ వ్యవసాయ సంచాలకులు నాగరాజ తెలిపారు. సిద్దవటం మండలంలోని టక్కోలు రైతు సేవా కేంద్రాన్ని సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పలు రికార్డులను పరిశీలించి తగు సూచనలు, సలహాలు చేశారు. తరువాత ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతుల సంఖ్య, విస్తీర్ణం పెంచాలన్నారు. కిచెన్ గార్డెన్ ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా సిబ్బందికి తెలియజేశారు. వేసవి దృష్ట్యా ఘన జీవామృతం తయారీకి ఇది అనువైన సమయం అన్నారు. రైతులకు అవసరమైన నవదాన్య కిట్స్ తయారు చేయడం గురించి వివరించామన్నారు. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి విడుదల లైవ్ టెలికాస్టులో పాల్గొని ప్రాధాన్యత, అర్హతలు రైతులకు వివరించారు. అలాగే రబీ సీజన్‌లో సాగైన ప్రతి పంటను ఇ–పంట నమోదు చేసి ఈకేవైసీ పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం వ్యవసాయ సహాయకులు వంశీశివ ఫణీంద్ర, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సింగరయ్య, చిన్నక్క, పల్లవి తదితరులు పాల్గొన్నారు.

రుణాల కంతులను సమయానికి కట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎం సుజాత

సిద్దవటం : డ్వాక్రా సంఘ సభ్యులు తీసుకున్న రుణాలను నెలనెల బ్యాంకులో జమచేయాలని ఏపీఎం సుజాత తెలిపారు. మండల కేంద్రంలోని డ్వాక్రా భవనంలో సోమవారం మండల సమాఖ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ బ్యాంకు రుణాలు, స్త్రీ నిధి రుణాలు, సీఐఎఫ్ రుణాలు, రికవరీ గురించి 33 గ్రామ సమాఖ్య సభ్యులతో సమావేశం నిర్వహించారు. మండల సమాఖ్య నూతన భవన నిర్మాణానికి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లే విధంగా డ్వాక్రా సంఘ సభ్యులు కృషి చేయాలన్నారు. స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణాంధ్రలో భాగంగా ప్రతి ఇంటికి హోమ్ కంపోస్టు, కిచెన్ గార్డెన్‌లపై డ్వాక్రా సంఘ సభ్యులు అవగాహన కలిగి ఉండాలన్నారు. గ్రూప్‌లో ఉన్న సభ్యులు అందరూ అధ్యక్షురాలి అనుమతితో ప్రతి విషయంపై చర్చించాలని ఆమె అన్నారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు ఎల్లమ్మ, కార్యదర్శి కె.సుజాత, కోశాధికారి ఉమామహేశ్వరి, ఈసీ సభ్యులు, సీసీలు పాల్గొన్నారు.